క్లుప్తంగా

మంత్రులను కలిసిన ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య



మంత్రి పొన్నం ప్రభాకర్‌ను సన్మానిస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

యాదగిరిగుట్ట: మంత్రులు అడ్లూరి లక్ష్మణ్, పొన్నం ప్రభాకర్‌ను శుక్రవారం ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య కలిశారు. ఈ సందర్భంగా మంత్రులను సన్మానించి శ్రీయాదగిరి లక్ష్మీనరసింహస్వామి లడ్డూ ప్రసాదాలను అందజేశారు. ఆలేరు నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులు, పలు సమస్యలను వివరించారు.

టీపీసీసీ అధ్యక్షుడికి సన్మానం

ఆలేరు: టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌ను టీపీసీసీ ప్రధాన కార్యదర్శిగా నియామకమైన పల్లె శ్రీనివాస్‌గౌడ్ శుక్రవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా ఆయనను కలసి యాదగిరి లక్ష్మీనర్సింహా స్వామి ప్రసాదాన్ని అందజేశారు. ఆయన వెంట పార్టీ నాయకులు జిన్నా హరినాథ్‌రెడ్డి,బండి నాగన్న ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

యాదగిరిగుట్ట రూరల్ : మండలంలోని వంగపల్లి సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ సురేంద్ర నాయుడు శుక్రవారం ఒక ప్రకటన తెలిపారు. వంగపల్లి, అహ్మద్‌నగర్, చొల్లేరు, మల్లిగూడెం, మహబూబ్‌పేట గ్రామాల ప్రజలు విద్యుత్ సిబ్బందికి సహకరించాలన్నారు.

సైకిళ్లు బహూకరణ



విద్యార్థులకు సైకిళ్లు బహూకరిస్తున్న ఇటమోని నరేందర్

భూదాన్‌పోచంపల్లి : మున్సిపాలిటీ పరిధిలోని ముక్తాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో 7వ తరగతిలో బండారి దీపిక, ఉమాశంకర్ టాపర్లుగా నిలిచారు. విద్యార్థులకు గ్రామానికి చెందిన ఇటమోని నరేందర్ శుక్రవారం సైకిళ్లు బహూకరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ పి. ప్రభాకర్, ప్రధానోపాధ్యాయుడు పంతుల మధుబాబు, అర్బన్‌బ్యాంకు డైరెక్టర్ కొండమడుగు ఎల్లస్వామి, మాజీ సర్పంచ్ కె. మైసయ్య, బండారు ప్రకాశ్‌రెడ్డి, చెన్నకేశవస్వామి దేవాలయ మాజీ చైర్మన్ సన్న నర్సింహ, బండారు శేఖర్‌రెడ్డి, మహేశ్ పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి

బొమ్మలరామారం : ఎన్నికల సమయంలో గొల్ల కురుమలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని గొర్రెల, మేకల పెంపకం దారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మద్దెపురం రాజు ప్రభుత్వాని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆ సంఘం మండల అధ్యక్షుడు బుడుమ శ్రీశైలం అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ గూదే బాల్ నర్సింహ, చిరంజీవి, బైరబోయిన రాజు, మేటీ రమేష్, రాసాల మల్లేష్, కృష్ణ, బీరప్ప, రమేష్, బాలరాజ్ పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లులు చెల్లించాలి

మోత్కూరు : నాయీ బ్రాహ్మణుల క్షౌర దుకాణాలకు 250 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకం కింద ఇవ్వాల్సిన పెండింగ్ బిల్లులను చెల్లించాలని క్షౌ ర వృత్తిదారుల సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వేముల భిక్షం డిమాండ్ చేశారు. క్షౌ ర వృత్తిదారుల సమస్యలపై ఈ నెల 17న ఇందిరాపార్కు వద్ద నిర్వహించనున్న ధర్నాకు సంబంధించిన కరపత్రాన్ని శుక్రవారం మున్సిపల్ కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ఆవిష్కరించారు. కార్యక్రమంలో చేతి వృత్తిదారుల సంఘం మండల అధ్యక్షుడు రామలింగం, విద్యాసాగర్, నాయకులు దాస్, మచ్చగిరి, సురేష్, వెంకటేష్, నరేష్, స్వామి, మల్లేష్, మణికంఠ, రాములు పాల్గొన్నారు.

సభను జయప్రదం చేయాలి

బొమ్మలరామారం : మండలంలోని మర్యాల గ్రామంలో ఈ నెల 16న నిర్వహించనున్న సీపీఐ మండల మహా సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి బొలగాని సత్యనారయణ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన ఆ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి అన్నెమైన వెంకటేష్, భారతమ్మ, విట్టల్ నాయక్, మల్లేష్ పాల్గొన్నారు.

ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకోవాలి

వలిగొండ : గ్రామగ్రామాన జులై 7న ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకోవాలని ఎమ్మార్పీఎస్ నాయకుడు బిర్రు మహేందర్ మాదిగ అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలో నిర్వహించిన వలిగొండ, రామన్నపేట మండలాల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో దుబ్బ రామకృష్ణ , రామచంద్ర, మల్లేష్, దానయ్య, నల్ల స్వామి, అంజయ్య పాల్గొన్నారు.

రోడ్లపై వర్షపు నీరు.. బాగు చేసేదెవరు!

చౌటుప్పల్ : పట్టణ కేంద్రంలో చిన్నపాటి వర్షం కురిసిన రోడ్లపైన నీరు నిలిచి చెరువులు, కుంటలను తలపిస్తున్నాయి. ఇటీవల కురిసిన ఓ మోస్తరు వర్షానికి పట్టణంలోని పలు రోడ్లపై నీరు చేరి బురదమయంగా మారాయి. తంగడపల్లిరోడ్డులో నాగులకుంట వద్ద ప్రధాన రహదారితో పాటు అంతర్గత సీసీరోడ్లపై కూడా ఇవే పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు, పాదాచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్లపై వర్షపు నీరు నిలువకుండా తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



సుభాష్ చంద్రబోస్ విగ్రహం సమీపంలో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు



అటవీశాఖ కార్యాలయం సమీపంలో నడిరోడ్డుపై నిలిచిన వర్షపు నీరు



విద్యానగర్‌లో సీసీరోడ్డుపై నిలిచిన వర్షపు నీరు



నాగులకుంట క్రాస్‌రోడ్ వద్ద..

వైఎస్ నాటి స్వర్ణయుగం మళ్లీ వచ్చింది

- ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

బీబీనగర్ : దివగంత నేత వైఎస్సార్ హయాం నాటి స్వర్ణయుగం తిరిగి తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక వచ్చిందని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన 717మంది లబ్ధిదారులకు శుక్రవారం కలెక్టర్ హనుమంతరావుతో కలిసి మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2004లో వైఎస్ సీఎం అయిన తరువాత దేశంలో ఎక్కడా లేని విధంగా ఉమ్మడి రాష్ట్రంలో 45లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశారన్నారని గుర్తు చేశారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పేదలకు ఇళ్లు ఇవ్వలేదని విమర్శించారు. బీబీనగర్‌కు రూ.14కోట్లు హెచ్ఎండీఏ నిధులు సైతం విడుదల చేయించానని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ భాస్కర్‌రావు, మండల ప్రత్యేకాధికారి సుభాషిణి, తహసీల్దార్ శ్యామ్‌సుందర్‌రెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, రామాంజనేయులు, శ్యామ్‌గౌడ్, బాల్‌రెడ్డి, సత్తిరెడ్డి, నరేంధర్‌రెడ్డి, బాలకృష్ణగౌడ్, పెంటయ్య పాల్గొన్నారు.



లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలి

భువనగిరి : దాతల సహకారాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నతస్థాయికి ఎదగాలని కాంగ్రెస్ నాయకుడు ఫక్కీర్ కొండల్‌రెడ్డి అన్నారు. మండలంలోని అనంతారంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శుక్రవారం ఆయన నోటు పుస్తకాలను అందజేశారు. అనంతరం ముగ్గురు దివ్యాంగులకు వీల్ చైర్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ విఠల్, వెంకటేష్, హెచ్ఎం వినోద, ఉపాధ్యాయులు ఉన్నారు.

చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్య ఎంతో కీలకం



భువనగిరిటౌన్ : ర్యాలీలో పాల్గొన్న సీడీపీఓ శాగంటి శైలజ, అంగన్‌వాడీ టీచర్లు

భువనగిరిటౌన్ : మూడు నుంచి ఐదు సంవత్సరాల వయసున్న చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్య ఎంతో కీలకమైందని సీడీపీఓ శాగంటి శైలజ అన్నారు. అమ్మమాట– అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం భువనగిరి పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో ఆమె పాల్గొని మాట్లాడారు. చిన్నారులకు పాఠశాలల్లో చేరేనాటికి అక్షరాలు, అంకెలు నేర్పి ఆటపాటలతో కూడిన విద్యను అందించాలనే లక్ష్యంతో అంగన్‌వాడీ కేంద్రాలను తీర్చిదిద్దినట్లు తెలిపారు. అంగన్ వాడీ సెంటర్లలో చిన్నారుల నమోదు శాతాన్ని పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పద్మ, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

వలిగొండ : మండలంలోని లోతుకుంట గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం అమ్మ మాట–అంగన్‌వాడీ బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్ బాలమణి, విజయ, ప్రవీణ్ పాల్గొన్నారు.

తుర్కపల్లి : మండలంలోని మాదాపూర్ సెక్టార్‌లోని ముల్కలపల్లి గ్రామంలో శుక్రవారం అమ్మ మాట – అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ నజీమోనిస్, అంగన్‌వాడీ టీచర్ వి.సులోచన, ఏఎన్ఎం సంధ్యారాణి, మాదవి తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం

మోత్కూరు : మున్సిపల్ కేంద్రంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా స్వామివారి కల్యాణోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. అనంతరం ఆలయ నిర్మాణ దాత ఎగమాటి రాంరెడ్డి, అరుణ దంపతులు అన్నదానం చేశారు. అర్చకుడు కారంపూడి నర్సింహా చార్యులు, అరుణాచార్యులు, వెంకటరమణాచార్యులు, పారునంది లక్ష్మణమూర్తిల ఆధ్వర్యంలో జరుగుతున్న పూజా కార్యక్రమాల్లో సూరం సోమిరెడ్డిరమాదేవి, ఆలయ కమిటీ అధ్యక్షుడు ముప్పా వెంకట్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సోమ వెంకన్న, కోశాధికారి ఆమనగంటి వెంకట్‌రెడ్డి, ఉపాధ్యక్షులు కొప్పుల కరుణాకర్‌రెడ్డి, గుండా మల్లేష్, సోమయ్య, గుండా బాలాజి, సహాయ కార్యదర్శులు మంగేష్, జయశ్రీ, శైలజ, తిరుమల్‌రెడ్డి పాల్గొన్నారు.



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

మున్సిపాలిటీల్లో కొనసాగుతున్న వంద రోజుల యాక్షన్ ప్లాన్



భువనగిరిటౌన్ : వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

భువనగిరిటౌన్ : మున్సిపాలిటీలో కొనసాగుతున్న వంద రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా శుక్రవారం భువనగిరి మున్సిపల్ కార్యాలయంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. రిసోర్స్ పర్సన్, మహిళా సంఘాల సభ్యులు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. అంతకు ముందు పలు వార్డుల్లో తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్, హెల్త్ అసిస్టెంట్, అధికారులు, సిబ్బంది, తదితరులు, పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

చౌటుప్పల్ : సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరమని మున్సిపల్ కమిషనర్ కోమటిరెడ్డి నర్సింహారెడ్డి, మండల వైద్యాధికారి డాక్టర్ చింతకింది కాటంరాజు తెలిపారు. వంద రోజుల ప్రణాళికలో భాగంగా శుక్రవారం పట్టణ కేంద్రంలోని పలు వార్డుల్లో స్థానిక ప్రజలతో కలిసి ర్యాలీలు నిర్వహించారు. అనంతరం మున్సిపల్ సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ హనుమాన్‌ప్రసాద్, పర్యావరణ ఇంజనీర్ రేణుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలి

మోత్కూరు : తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని మున్సిపల్ కమిషనర్ కె.సతీష్‌కుమార్ అన్నారు. మున్సిపాలిటీలో వంద రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా శుక్రవారం మోత్కూరు మున్సిపల్ పరిధిలోని బుజిలాపురంలో తడి చెత్త, పొడి చెత్త, హానికరమైన చెత్తపై పారిశుద్ధ్య సిబ్బందికి, ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ ప్రభాకర్, పర్యావరణ ఇంజనీర్ శ్రవణ్‌కుమార్, శానిటేషన్ సూపర్‌వైజర్ వీరస్వామి, పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

పిడుగుపాటుకు పాడి గేదె మృతి

మోత్కూరు : మండలం రాగిబావి గ్రామంలో పిడుగుపాటుకు పాడి గేదె మృతి సంఘటన శుక్రవారం జరిగింది. వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు బిల్ల సోమిరెడ్డి తన గేదెను మేత మేపుతుండగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షానికి పిడుగు పడి గేదె అక్కడికక్కడే మృతి చెందింది. అరు నెలల క్రితమే విద్యుదాఘాతంతో ఒక గేదె మృతి చెందగా ఇప్పుడు పిడుగుపాటుకు మరో గేదె మృతిచ చెందిందని బాధిత రైతు తెలిపాడు.

పెట్రోల్ బంక్‌పై ఫిర్యాదు

మోత్కూరు : మండలంలోని పాలడుగు గ్రామంలోని కేతన్ పెట్రోల్ బంక్‌పై మోత్కూరుకు చెందిన వాహనదారుడు ఆకవరం శ్రీనివాసులు శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. పెట్రోల్ కొలతల్లో తేడాలు ఉన్నాయని.. బంక్ సిబ్బంది సైతం దురుసుగా ప్రవర్తిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. విచారణ జరిపి వారిపై చర్య తీసుకోవాలని కోరారు.

మొక్కలను సంరక్షించాలి

ఆత్మకూరు(ఎం): గ్రామాల్లో నాటిన మొక్కలను సంరక్షించాలని ఎంపీడీఓ రాములు నాయక్ అన్నారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మొక్కల పెంపకానికి అవసరమైన స్థలాలను గుర్తించాలన్నారు. గుర్తించిన స్థలాల్లో పిట్టింగ్ వర్క్‌ను మొదలు పెట్టాలని సూచించారు. సమావేశంలో ఏపీఓ బి. రమేష్, ఈసీ శ్రీనువాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బెల్ట్ షాప్‌కు బీర్లు తరలిస్తుండగా అడ్డగింత

మోటకొండూర్: మండలంలోని ముత్తిరెడ్డిగూడెంలో గల వైన్స్ నుంచి శుక్రవారం రాత్రి కింగ్‌ఫిషర్ బీర్లను ఆటోలో గుట్టుచప్పుడు కాకుండా బెల్ట్ షాపులకు తరలిస్తుండగా వినియోగదారులు అడ్డుకున్నారు. వైన్స్‌లకు వచ్చే వినియోగదారులకు లేకుండా అధిక ధరకు బెల్ట్ షాపులకు అమ్ముతున్నారని ఆరోపించారు. దీంతో కొరత ఏర్పడుతుందన్నారు. మద్యం పక్కదారి పట్టకుండా ఎక్సైజ్ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

సర్వీస్‌రోడ్డు పనుల పరిశీలన

చౌటుప్పల్ : పట్టణ కేంద్రంలో అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మాణంలో భాగంగా చేపట్టిన సర్వీస్ రోడ్డు పనులను శుక్రవారం సీపీఐ నాయకులు పరిశీలించారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి పల్లె శేఖర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, రామలింగం, వెంకటేష్, రాములు, మంకులు, యాదయ్య, నర్సింహ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

రాజాపేట : మండలంలోని రఘునాథపురం, చల్లూరు గ్రామాలకు చెందిన బీజేపీ పార్టీ సీనియర్ నాయకులు కంచర్ల రామచంద్రారెడ్డి, కల్లూరి వేణుగోపాల్‌రెడ్డిలను శుక్రవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఊట్కూరి అశోక్ గౌడ్ పరామర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బింగి శ్రీనివాసులు, శ్రీనివాస్‌రెడ్డి, మెండ భగవాన్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య : డీఈఓ

మోటకొండూర్ : ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని డీఈఓ సత్యనారాయణ అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని కాటేపల్లి ప్రాథమిక పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలేరు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పచ్చిమట్ల మదార్‌గౌడ్, మండల విద్యాధికారి రఘురాంరెడ్డి, చాడ ప్రధానోపాధ్యాయులు మోర బాలగంగాధర్‌రెడ్డి, పాఠశాల హెచ్ఎం మంజుల, ఉపాధ్యాయులు శంకర్, శాంతాకుమారి, సీఆర్‌పీ నరేందర్, మాజీ సర్పంచ్ మంత్రి రాజు తదితరులు పాల్గొన్నారు.



మోటకొండూర్ : కాటేపల్లిలో అక్షరాభ్యాసం చేయిస్తున్న డీఈఓ సత్యనారాయణ

ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలి

రామన్నపేట : ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలని వెల్లంకి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టి.సురేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం వెల్లంకి ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మోహన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ తాటిపాముల శేఖర్‌గౌడ్, దాత తూడి మురళీధర్, తాటిపాముల స్వామి, వనం ఉపేందర్ ఉపాధ్యాయులు భిక్షమయ్య, సోమిరెడ్డి, ఎం.వెంకటయ్య, సువర్ణ, మాధవి పాల్గొన్నారు.

వలిగొండ : ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషిచేయాలని ఎంఈఓ భాస్కర్ అన్నారు. మండల కేంద్రంలోని బీసీ కాలనీలోని ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పాఠశాల విద్యార్థులకు అక్షరాభ్యాసం చేయించారు.ఈ కార్యక్రమంలో లింగారెడ్డి, శ్రీధర్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అక్షరాభ్యాసం

భూదాన్‌పోచంపల్లి : మండలంలోని దోతిగూడెం ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ ముద్దం పారిజాత, పంచాయతీ కార్యదర్శి నరేశ్‌కుమార్, సత్యంయాదవ్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శంభులింగారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తుర్కపల్లి : మండలంలోని దత్తాయిపల్లి స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని పాఠశాలలో శుక్రవారం సామూహిక అక్షరభ్యాసం నిర్వహించారు. ప్రధానోపాద్యాయురాలు బి.అనురాధ మాట్లాడుతూ కాంప్లెక్స్ పరిధిలో నూతనంగా 25మంది విద్యార్థులు అడ్మిషన్లు తీసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు లక్ష్మయ్య, సౌజన్య, సుజీవన్‌రావు, అనిత, నాగర్జున, రమేష్, ప్రవీణ్, హజీమ, శ్రీధర్, పుష్పకుమారి పాల్గొన్నారు.

ఆలేరురూరల్ : మండలంలోని సాయిగుడెం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ బొడ్డు కవిత, ప్రాధానోపాధ్యాయులు మూల తిరుపతిరెడ్డి, కార్యదర్శి ప్రత్యూష, బైరి మహేంద్, నరసయ్య, రాములు, అండాలు జ్యోతి, రేణుక తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి

రాజాపేట : బడి ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ప్రధానోపాధ్యాయుడు నెమిల భరత్ కుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమణకుమారిలు అన్నారు. శుక్రవారం నెమిల ప్రాథమిక పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పద్మ, శోభ, ఎస్ఎంసీ చైర్మన్ గుజ్జ లక్ష్మి పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలకు అడ్మిషన్ల వెల్లువ

మోత్కూరు : మోత్కూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 6, 8, 10 తరగతుల్లో శుక్రవారం 25 మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందారు. ప్రభుత్వ పాఠశాలలో కల్పిస్తున్న వసతులను తల్లిదండ్రులకు వివరించడంతో పాఠశాలకు అడ్మిషన్లు వెల్లువల వస్తున్నాయని ప్రధానోపాధ్యాయుడు తీపిరెడ్డి గోపాల్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగడిబజార్ ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బోళ్ల హన్మంతు, హైస్కూల్ ఉపాధ్యాయులు డి.అరవిందరాయుడు, డి.వెంకటయ్య, స్వామిరాయుడు, ఉప్పలయ్య పాల్గొన్నారు.

పార్టీ కోసం కష్టపడే వారికే ప్రాధాన్యత

రామన్నపేట : పార్టీ కోసం కష్టపడే వారికే ప్రాధాన్యత ఉంటుందని ఎమ్మెల్యే వేముల వీరేశం, డీసీసీ అధ్యక్షుడు ఆడెపు సంజీవరెడ్డి, పీసీసీ పరిశీలకుడు పులి అనిల్ తెలిపారు. శుక్రవారం మండలకేంద్రంలో పార్టీ సంస్థాగత ఎన్నికల్లో భాగంగా మండల అధ్యక్ష పదవిని ఆశిస్తున్న నాయకుల నుంచి దరఖాస్తులు స్వీకరిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఏకకాలంలో రెండులక్షల వరకు రైతు రుణాలను మాఫీ చేయడంతో పాటు ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే బిల్లులు చెల్లించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సిరిగిరెడ్డి మల్లారెడ్డి పీఏసీఎస్ చైర్మన్ నంద్యాల భిక్షంరెడ్డి, గంగుల వెంకటరాజిరెడ్డి, పున్న రమేష్, పున్న జగన్మోహన్, ప్రభాకర్, మదూరి జ్యోతి, గుత్తా నర్సిరెడ్డి, శేఖర్, రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.



దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే వీరేశం, డీసీసీ అధ్యక్షుడు సంజీవరెడ్డి, పార్టీ పరిశీలకుడు అనిల్

నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉంచాలి

ఆలేరురూరల్ : రైతులకు నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉంచాలని విత్తన విజిలెన్స్ అధికారి గౌస్ అన్నారు. శుక్రవారం ఆలేరు పట్టణ కేంద్రంలోని పలు విత్తన, ఎరువుల దుకాణాలను తనిఖీ నిర్వహించారు. ఎమ్మార్పీ ధర కంటే ఎక్కువ ధరకు విత్తనాలు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు ప్యాకెట్‌పై వివరాలు సరిచూసుకోవాలన్నారు. తెలిపారు. కొనుగోలు చేసిన విత్తనాల బిల్లులు, రశీదులు రైతులు తమ వద్దే పంట కాలం పూర్తయ్యే వరకు ఉంచుకోవాలన్నారు. తనిఖీల్లో విత్తన విజిలెన్స్ బృందం సభ్యులు వెంకన్న, రాంబాబు, ఎంఈఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ఎరువులు, విత్తనాల దుకాణంలో తనిఖీలు చేస్తున్న విత్తన విజిలెన్స్ బృందం

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ



బాహుపేటలో ఇందిరమ్మ ఇంటికి భూమి పూజ చేస్తున్న అధికారులు

యాదగిరిగుట్ట రూరల్ : మండలంలోని బాహుపేట గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు శుక్రవారం హౌసింగ్ డీఈ శ్రీరాములు, యాదగిరిగుట్ట ఎంపీడీఓ నవీన్ కుమార్ లు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గడువులోగా ఇందిరమ్మ ఇళ్లను పూర్తి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చీర శ్రీశైలం, మోటె శేఖర్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు సిద్దులు, స్వామి, భాస్కర్, గణేష్, పంచాయతీ సెక్రటరీ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం): మండల కేంద్రంలో పలువురు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు శుక్రవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యాస లక్ష్మారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ జిల్లాల శేఖరరెడ్డి, మాజీ సర్పంచ్ జన్నాయికోడె నగేష్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు పోతగాని మల్లేశం గౌడ్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

భూ భారతితో రైతులకు మేలు

వలిగొండ : భూ భారతితో రైతులకు మేలు జరుగుతుందని చౌటుప్పల్ ఆర్డీఓ శేఖర్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని టేకులసోమారం, ఆరూర్ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. టేకులసోమారంలో నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆరూర్ శివారులోని 409 సర్వే నంబర్‌లో గల ప్రభుత్వ భూమికి, బోడ గుట్ట చుట్టూ గల ప్రభుత్వ భూమికి హద్దురాళ్లు ఏర్పాటు చేయాలని కోరుతూ పలువురు గ్రామస్తులు డిప్యూటీ తహసీల్దార్ పల్లవికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ దశరథ, డిప్యూటీ తహసీల్దార్ పల్లవి, రెవెన్యూ అధికారులు మనోహర్, కర్ణాకర్ రెడ్డి, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

కల్వర్టు నిర్మాణ పనులు పూర్తిచేయాలి

వలిగొండ : కల్వర్టు నిర్మాణాలు పూర్తి చేసి సాగు నీరందించాలని బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్ అన్నారు. శుక్రవారం భీమలింగం కాల్వ కల్వర్టులను స్థానిక బీజేపీ నాయకులతో కలిసి పరిశీలించారు. భీమలింగం కాల్వపై నిర్మిస్తున్న కల్వర్టును పూర్తి చేసి కాల్వ ద్వారా నీటిని విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బోళ్ల సుదర్శన్, కొప్పుల యాదిరెడ్డి, రాచకొండ కృష్ణ, బందారపు రాములు, కందుల తానీషా, లోడే లింగ స్వామి, నర్సింహ, మైసోల్ల రామనర్సు, మైసోల్ల మత్స్యగిరి, వెంకటేశం, లింగ స్వామి, కొత్త రాంచంద్రమ్, పద్మారెడ్డి, రంజిత్ రెడ్డి పాల్గొన్నారు.

స్పోర్ట్స్ స్కూళ్లలో ప్రవేశానికి ఎంపిక పోటీలు

సాక్షి నెట్‌వర్క్ : రాష్ట్రంలోని క్రీడా పాఠశాలల్లో 2025–26 విద్యా సంవత్సరంలో నాలుగో తరగతిలో ప్రవేశాలకు ఈ నెల 16నుంచి జిల్లా వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో మండల స్థాయి ఎంపిక పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆయా మండలాల ఎంఈఓలు వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. 30 మీటర్ల ఫ్లయింగ్ స్టార్ట్, స్టాండింగ్ బ్రాడ్ జంప్, 800 మీటర్స్ రన్నింగ్, 6.10 మీటర్ల షటిల్ రన్, మెడిసిన్ బాల్‌త్రో (కిలో బరువు), వర్టికల్ జంప్, ఫ్లెక్సీబులిటీ మరియు మెడికల్ టెస్ట్ ఉంటాయి. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు 2016 నవబర్ 1నుంచి 2017 ఆగస్టు 31 మధ్య జన్మించి ఉండాలి.

ఎంపిక పోటీల తేదీలు, పాఠశాలలు

అడ్డగూడూరు : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 18న ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఎంఈఓ నర్రా సబిత తెలిపారు.

ఆత్మకూర్(ఎం) : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 16 నుంచి 19 వరకు నిర్వహించనున్నారు. ఫోన్ నంబర్ 98482 90705 సంప్రదించాలని ఎంఈఓ మహదేవ్ రెడ్డి తెలిపారు.

సంస్థాన్ నారాయణపురం: సర్వేల్ గురుకుల పాఠశాలలో 16న ఎంపిక పోటీలు నిర్వహించనున్నారు.

వలిగొండ: మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ పాఠశాలలో ఈ నెల 17న ఎంపిక పోటీలు నిర్వహించనున్నారు.

యాదగిరిగుట్ట : పట్టణంలోని గోశాల ప్రభుత్వ పాఠశాలలో 17న ఎంపిక పోటీలు నిర్వహించనున్నారు. సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు ఎంఈఓ 7674841231, పీడీ సంగీత 9052175343.

గుండాల : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 16నుంచి 19 వరకు ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఎంఈఓ అగ్గి రాములు తెలిపారు.

మోత్కూరు: మోత్కూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 18న మండల స్థాయి ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఎంఈఓ గోపాల్ రెడ్డి తెలిపారు.

మోటకొండూర్ : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈ నెల 19న నిర్వహించనున్నట్లు ఎంఈఓ రఘురాంరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ముందుగానే ఆరుద్ర పురుగులు



పంటపొలాల్లో ఆరుద్ర పురుగులు

రామన్నపేట : ఆరుద్ర కార్తె సమయంలో విరివిగా కనిపించే ఆరుద్ర పురుగు ఈ సారి కాస్త ముందుగానే కనిపించింది. శుక్రవారం రామన్నపేట మండల కేంద్రానికి చెందిన మిర్యాల మల్లేశం పొలంలో ఆరుద్ర పురుగులు కనిపించాయి. నల్లని నేలపై ఎర్రని రంగులో నిగనిగలాడుతూ ఆరుద్ర పురుగులు కనువిందు చేశాయి. ముందుగానే ఆరుద్ర పురుగు కనిపించడం శుభ సూచకం అని అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.